బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 09 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4

## త్రివిధ దళాధిపతులతో రాజ్‌నాథ్ సింగ్, అజిత్ దోవల్ భేటీ..

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

భారత్‌పై పాకిస్థాన్ నుంచి భారీ స్థాయిలో దాడులు జరిగినట్లు సమాచారం అందడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ ఘటనకు సంబంధించిన కీలక వివరాలను కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వివరించారు. ఈ సమాచారం అందిన వెంటనే, ప్రధానమంత్రి మోదీ తాజా పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నారని కేంద్ర వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలో సరిహద్దు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అత్యున్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో సీడీఎస్, త్రివిధ దళాధిపతులు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. కాగా, పాకిస్థాన్ దాడులను భారత సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతోంది. పాక్ సరిహద్దుల్లోని రాష్ట్రాల్లో హైఅలర్ట్ ప్రకటించారు. జమ్ము కశ్మీర్ తో పాటు రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. అధికారులకు సెలవులను రద్దు చేశాయి. అధికారులు ఎవరూ జిల్లా దాటి వెళ్లవద్దని, అందరూ అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ అయ్యాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు.

# మొదలైన యుద్ధం

## విరుచుకుపడుతున్న పాక్ డ్రోన్ దాడులు..తిప్పికొడుతున్న భారత సైన్యం

## పది పాక్ క్షిపణుల కూల్చివేత

## భారత్‌లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని రక్షణ శాఖ వెల్లడి



బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

పహల్గాం దాడులకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది. మే6 అర్ధరాత్రి ఆపరేషన్ సిందూర్ తర్వాత సరిహద్దులో పాకిస్థాన్ కాల్పులు తీవ్రతరం చేసింది. దీనికి బదులుగా భారత్ పాకిస్థాన్ రక్షణ వ్యవస్థలపై దాడులు జరిపింది. దీంతో లాహోర్‌లోని గగనతల రక్షణ వ్యవస్థ నిర్వీర్యం అయినట్లు భారత సైన్యం గురువారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో జమ్మూలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

భారత్ మెరుపు దాడులతో కకావికలమైన పాకిస్తాన్.. తన ఉనికిని చాటుకొనేం దుకు బరితెగించింది. జమ్మూ,పంజాబ్, రాజస్థాన్‌పై క్షిపణులతో తెగబడుతోంది. జమ్మూ ఎయిర్‌పోర్టు సమీపంలో పాకిస్తాన్ ఆత్మాహుతి డ్రోన్ దాడులకు పాల్పడినట్టు సమాచారం. సర్వసన్నద్ధంగా ఉన్న భారత సైన్యం పాక్ దాడుల్ని తిప్పికొడుతోంది. అఖ్నూర్, కిష్త్వార్, సాంబా సెక్టార్‌లో అధికారులు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. జమ్మూ జిల్లా వ్యాప్తంగా సైరన్లు మోగిస్తున్నారు. ప్రజలంతా ఇండ్లలోనే ఉండాలని సైన్యం హెచ్చరికలు జారీచేసింది. జమ్మూతో సహా పఠాన్‌కోట్, ఉధమ్ పుర్‌లలో ఈ దాడులు జరుగుతున్నట్టు సమాచారం. మరోవైపు సాంబా జిల్లాలో పాక్ రేంజర్లు కాల్పులకు తెగబడుతున్నట్టు సమాచారం. పలుచోట్ల భారీగా శబ్దాలు వినిపిస్తున్నాయి. అఖ్నూర్ సెక్టార్ సహా పలు ప్రాంతాల్లో సైరన్లు మోగుతు న్నాయి. పంజాబ్ సరిహద్దులోని ప్రాంతాలపై కూడా పాక్ డ్రోన్ దాడులకు దిగింది. మరో వైపు, పాక్ దాడులను భారత సైన్యం తిప్పికొడుతోంది. పది పాక్ క్షిపణులను నిర్వీర్యం చేసింది. జమ్మూ యూనివర్సిటీకి సమీపంలో రెండు డ్రోన్లను ధ్వంసం చేసినట్టు సమాచారం. మొత్తంగా ఇప్పటివరకు ఎనిమిది డ్రోన్లను నిర్వీర్యం చేసినట్లు తెలిసింది.

గురువారం సాయంత్రం భారత్‌పై పాక్ దుస్సాహసానికి ఒడిగట్టింది. రాత్రి 9.00 గంటల అనంతరం జమ్ముతోపాటు సరిహద్దు ప్రాంతాల్లో డ్రోన్‌లతో దాడులకు తెగబడింది. సరిహద్దు ఆవలి నుంచి పలు క్షిపణులను ప్రయోగించింది. అయితే వెంటనే స్పందించిన భారత సైన్యం దీటుగా జవాబు చెప్పింది. పాక్ ప్రయోగించిన దాదాపు అన్ని డ్రోన్లను కూల్చివేసింది. ఎస్-400 రక్షణ వ్యవస్థతో క్షిపణులను గగనతలంలోనే అడ్డుకొని ధ్వంసం చేసింది. ఒక ఎఫ్-16, రెండు జేఎఫ్-17 యుద్ధ విమానాలను కూల్చివేసింది. పాకిస్థాన్‌కు చెందిన గగనతల హెచ్చరిక, నియంత్రణ వ్యవస్థలను నిర్వీర్యం చేసింది. దీంతో గంటన్నర వ్యవధిలోనే పాక్ తోకముడిచింది. పాక్ దాడిని విజయవంతంగా తిప్పికొట్టామని, భారత్‌కు ఎటువంటి నష్టం జరుగలేదని సైనిక దళాలు ప్రకటించాయి. కొద్దిసేపు సహనం ప్రదర్శించిన భారత్ ఆ తరువాత పాక్‌లోని లాహోర్, సియాల్‌కోట్‌పై దాడికి దిగింది.

### పలు రాష్ట్రాల్లో బ్లాక్ అవుట్

పాక్ ఆకస్మిక సైనిక చర్యతో భారత్ ముందుజాగ్రత్త చర్యగా పంజాబ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, గుజరాత్‌లోని పలు ప్రాంతాలలో బ్లాక్‌అవుట్ ప్రకటించింది. పెరిగిన ఉద్రిక్తతల నేపథ్యంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ త్రివిధ దళాధిపతులతో సమావేశమయ్యారు. మరోవైపు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ హుటాహుటిన ప్రధాని ఇంటికి బయలుదేరారు. ఈసారి పశ్చిమ భారతాన్ని లక్ష్యంగా చేసుకున్న పాక్ ఆ వైపు సరిహద్దు వెంట ఒకేసారి భారీ సంఖ్యలో డ్రోన్లను, క్షిపణులను ప్రయోగించింది. పంజాబ్‌లోని ఉదంపూర్, పఠాన్‌కోట్, ఎయిర్‌బేస్‌లు, రాజస్థాన్‌లోని జైసల్మేర్, గుజరాత్‌లోని సర్‌క్రీక్ వద్ద దాడికి వచ్చిన డ్రోన్లను భారత దళాలు కూల్చివేశాయి. జమ్ములోనే ఎనిమిది డ్రోన్లను కూల్చివేశాయి. వాటి రాకను రాడార్ వ్యవస్థ ముందే పసిగట్టడంతో అప్రమత్తమైన ఎస్-400 రక్షణ వ్యవస్థ డ్రోన్లను, క్షిపణులను మధ్యలోనే అడ్డుకొని ఆకాశంలోనే ధ్వంసం చేసింది. పాక్ కవ్వింపుతో జమ్ము, కుప్వారా, చండీగఢ్, మొహాలీ నగరాల్లో ఎమర్జెన్సీ సైరన్లు మోగాయి.

### మూడు యుద్ధ విమానాల కూల్చివేత

భారత సాయుధ దళాలు జమ్ముపై దాడికి వచ్చిన పాకిస్థాన్‌కు చెందిన మూడు ఫైటర్‌జెట్ విమానాలను కూల్చివేశాయి. వీటిలో ఒకటి అమెరికా తయారీ ఎఫ్-16 కాగా, రెండు జేఎఫ్-17 విమానాలున్నాయి. ఎఫ్-16 పైలట్ బందీగా చిక్కినట్టు తెలిసింది. జమ్ముకశ్మీర్‌లోని జమ్ము, ఆర్‌ఎస్‌పురా, చనీ హిమత్ వాటి పరిసర ప్రాంతాలలో సైనిక, పౌర నివాసాలు లక్ష్యంగా పాక్ దాడికి ప్రయత్నించింది. అయితే భారత అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు ఎస్-400, ఆకాశ్ వ్యవస్థలు విజయవంతంగా పాక్ మిస్సైళ్లను, డ్రోన్లను ఎదుర్కొని కూల్చివేశాయి. జమ్ముపై దాడికి వచ్చిన 8 డ్రోన్లు లేదా క్షిపణులను కూల్చివేసినట్టు సైనికవర్గాలు ప్రకటించాయి. పాక్‌లోని సర్గోధా నుంచి జమ్ము వైపు వచ్చిన ఎఫ్-16 ఫైటర్ జెట్‌ను కూడా కూల్చివేసినట్టు తెలిపాయి.

# 100 మంది ఉగ్రవాదలు హతం



- ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది
- భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
- అఖిలపక్ష భేటీ

బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో

భారత్ చేసిన మెరుపుదాడిలో దాదాపు 100 మంది ఉగ్రవాదలు మరణించారని భారత రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. గురువారంజరిగిన అఖిలపక్ష భేటీలో ఆయన కీలక విషయాలు వెల్లడించారు. ఈ సమావేశంలో త్రివిధ దళాలను అఖిలపక్ష నేతలతో పాటు ఆయన అభినందించారు. ఆపై మీడియా సమావేశం నిర్వహించారు. భారత్ చేసిన మెరుపుదాడిలో దాదాపు 100 మంది ఉగ్రవాదలు మరణించారని ఆయన తెలిపారు. అయితే, ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని.. కొనసాగుతోందని ఆయన వెల్లడించారు. పాకిస్థాన్ తీరు మార్చుకోకుంటే తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

పీఓకే ప్రాంతంలో ఉన్న ఉగ్రవాద స్థావరాలను ఇండియన్ ఆర్మీ పూర్తిగా ధ్వంసం చేసిందని రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. ఈ క్రమంలో ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న సైన్యంపై రాజ్‌నాథ్‌సింగ్ అభినందనలు తెలిపారు. భారత్ చేసిన దాడిలో పాక్ పౌరలకు ఎలాంటి నష్టం జరగలేదన్నారు. తాము కేవలం ఉగ్రవాదులను మాత్రమే టార్గెట్ చేశామని ఆయన వెల్లడించారు. పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ఔట్‌సోర్సింగ్ చేస్తోందని ఆయన విమర్శించారు.భారత్ వద్ద నైపుణ్యం పొందిన సైన్యంతో పాటు బలమైన ఆయుధాలు ఉన్నాయని గుర్తుచేశారు. సైనికులు చూపిన సాహసాలకు దేశం గర్విస్తుందన్నారు. భారత రక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ప్రధాని మోదీ పదేళ్ల క్రితం చెప్పారని గుర్తుచేశారు. రక్షణ పరికరాల కోసం తీవ్రంగా శ్రమించామన్నారు. నేడు భారత్ ఉత్పత్తి చేస్తున్న రక్షణ పరికరాలు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందాయన్నారు. భారత రక్షణ రంగంలో క్వాలిటీ, క్వాంటిటీని పెంచుతూ వచ్చామన్నారు.

ఇక దేశ భద్రత విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఐక్యతను ప్రదర్శించాయి. ఉగ్రవాద స్థావరాలపై భద్రతా దళాలకు చేసిన దాడికి రాజకీయ పార్టీలన్నీ మద్దతు తెలిపాయి. అలాగే భవిష్యత్తులో కూడా ఉగ్రవాదులను అణచివేసేందుకు భద్రతా దళాలు తీసుకున్న చర్యలకు మద్దతుగా ఉంటామని ముక్తకంఠంతో స్పష్టం చేశాయి. గురువారం పార్లమెంట్లోని లైబరీ భవన్‌లో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. ఆపరేషన్ సిందూర్ పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ విపక్షాలకు వివరించారు. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడించలేమని అన్నారు. అయితే ఈ ఉద్రిక్తతలను పెంచాలన్న ఉద్దేశం తమకు లేదని, కానీ పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాత్రం వెనక్కి తగ్గేదే లేదని పేర్కొన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా ఈ దాడులు చేశామని, ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతుందని వెల్లడించారు. ఈ సమావేశంలో కేంద్రం తరపున మంత్రులు అమిత్ షా, ఎస్.జైశంకర్, జెపి నడ్డా, నిర్మలా సీతారామన్, కిరణ్ రిజిజు, ప్రతిపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ (కాంగ్రెస్), సందీప్ బందోపాధ్యాయ (టీఎంసీ), టిఆర్ బాలు (డీఎంకే), జాన్ బ్రిట్టాస్ (సీపీఐ(ఎం), రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పీ), సంజయ్ సింగ్ (ఆప్), సుప్రియా సూలే (ఎన్‌సీపీ), సంజయ్ రౌత్ (శివసేన, ఠాక్రే), మహ్మద్ బషీర్ (ఐయూఎంఎల్), అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), సస్మిత్ పాత్ర (బీజేడీ), లావు శ్రీకృష్ణదేవరాయులు (టీడీపీ), వైవి సుబ్బారెడ్డి (వైసీపీ), శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే (శివసేన (షిండే)), ప్రఫుల్ పటేల్ (ఎన్‌సీపీ), కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ (ఆర్‌ఎల్‌ఎస్‌పి) తదితరులు పాల్గొన్నారు.

ఈ క్లిష్టమైన సమయంలో ప్రతిపక్షాలు అత్యంత పరిణితితో వ్యవహరించాయని

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అన్నారు. అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సమావేశంలో సమస్య తీవ్రత ద ృష్ట్యా చర్చలు నిర్మాణాత్మకంగా జరిగాయని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో ఐక్యంగా నిలబడ్డాయన్నారు. ప్రతి నాయకులు అందరూ

మిగితా 2వ పేజీలో

# హైడ్రా అంటే కూల్చేదే కాదు...



- హైదరాబాద్‌కు ఢిల్లీలాంటి పరిస్థితి రానివ్వొద్దనే 'హైడ్రా' తెచ్చాం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- హైడ్రా పోలీసు స్టేషన్ ప్రారంభం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ వారసత్వ సంపదను కాపాడుకుంటూ, ఇక్కడి ప్రకృతిని పరిరక్షిస్తూ దీన్ని ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. సహజ వనరులు, సంపద కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో ఈ నగరాన్ని పునరుద్ధరించాలన్న ఆలోచనతోనే హైడ్రాను ప్రారంభించామని వివరించారు. హైడ్రా అంటే కూల్చడమే కాదు, ఆస్తులను రక్షణ విపత్తుల నిర్వహణ అని తెలిపారు. ఎవరెన్ని విమర్శలు చేసినా ఆక్రమణలను నియంత్రించదలచుకున్నామని తెలిపారు. ట్యాంక్‌బండ్ బుద్ధభవన్‌లో హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ స్టేషన్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. హైడ్రాకు కేటాయించిన 122 వివిధ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు. హైడ్రా కోసం ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ హైడ్రా ఆవశ్యకతను వివరించారు. "హైడ్రా అంటే ఇదేదో కేవలం పేదల ఇండ్లు కూల్చడానికన్నట్టు కొందరు చిత్రీకరిస్తున్నారు. శాఖల మధ్య సమన్వయ లోపం వల్ల నగరంలో తలెత్తే సమస్యలు ఎవరు పరిష్కరించాలన్న విషయంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని గమనించి నిపుణులతో చర్చించి హైడ్రాను తెచ్చాం. ఆక్రమణలను తొలగించడం, అక్రమ నిర్మాణాలను తొలగించడం, కబ్జాలను అరికట్టడం, నాలాల పునరుద్ధరణ, నీటి కాలుష్యాలపై చర్యలు తీసుకోవడం, వర్షాలు, వరదల వంటి విపత్తు సమయాల్లో సహాయక చర్యల్లో పాల్గొనడం, ప్రజా ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరించడం వంటి అనేక కార్యక్రమాలు చేపడుతుంది. హైడ్రాపై అతిపెద్ద సామాజిక బాధ్యత పెట్టాం. ఇందులో పనిచేసే వారికి ఉద్యోగం కాదు. కాజ్యువల్ గా పనిచేస్తే కుదరదు. హైడ్రా మానవీయ కోణంలో పనిచేయాలి. నిరుపేదల పట్ల ప్రేమతో, పెద్దోళ్ల పట్ల కఠినంగా వ్యవహరించాలి. పేదవారిని ఆదుకోవడానికి ప్రత్యామ్నాయ ప్రణాళికలు తయారు చేయాలి. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తుంది.

ఇది ఓల్డ్ సిటీ కాదు, ఒరిజినల్ సిటీ. దీన్ని పునరుద్ధరించుకోవలసిన అవసరం ఉంది. బెంగుళూరులో నీటి నిలువలను ఒడిసిపట్టుకునే పరిస్థితి లేక వలసపోయే దుస్థితి వచ్చింది. చిన్న వరదలు వచ్చినా ముంబయ్, చెన్నై వరదల మయమైపోయాయి. దేశ రాజధాని ఢిల్లీ కాలుష్యం నియంత్రించని కారణంగా పార్లమెంట్ నుంచి పాఠశాలల వరకు సెలవులు ప్రకటించుకోవలసిన పరిస్థితి వచ్చింది. దేశంలోని మెట్రోపాలిటన్ సిటీలు నివసించడానికి యోగ్యం కాని నగరాలుగా మారుతున్నాయి. అలాంటి ఉపద్రవాల నుంచి గుణపాఠం నేర్చుకోకపోతే హైదరాబాద్ నగరం కూడా వాటి జాబితాలో చేరుతుంది. రాజధాని నగర అభివృద్ధిలో హైడ్రా భాగస్వామి అవుతుంది. అన్ని శాఖల సమన్వయంతో హైడ్రా అనేక పనులు చేస్తుంది. వర్షాలొస్తే, వరదలొస్తే కాలనీలకు కాలనీలే నీళ్లల్లో మునిగిపోతున్నాయి. చిన్న గాలొస్తే చెట్లు విరిగి పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీళ్లను తొలగించడానికి, కరెంట్ పోతే పునరుద్ధరించడానికి, వరదలు వస్తే చిక్కుకున్న వారిని రక్షించుకోవడానికి హైడ్రా పనిచేస్తుంది.మూసీని ప్రక్షాళన చేయాల్సిన అవసరంపై ప్రజలే అప్రమత్తం కావాలి.

మిగితా 2వ పేజీలో

## తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు

### తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరిక

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి సామాజిక మాధ్యమాలలో అసత్య వార్తలు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో హెచ్చరికలు జారీ చేసింది. ఈ ఆపరేషన్‌కు సంబంధించి ఎలాంటి నకిలీ సమాచారాన్ని గానీ, తప్పుడు ప్రచారాలను గానీ వ్యాప్తి చేయవద్దని స్పష్టం చేసింది. ఈ మేరకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సామాజిక మాధ్యమంలో అనధికారిక వార్తలు, అవాస్తవాలను పోస్టు చేసినా లేదా షేర్ చేసినా చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపింది. సామాజిక మాధ్యమాలపై నిరంతర నిఘా ఉంచినట్లు వెల్లడించింది. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి నిర్ధారణ లేని వార్తలను నమ్మవద్దని, ఇతరులకు పంపవద్దని సూచించింది. అంతేకాకుండా, 'ఆపరేషన్ సిందూర్' గురించి తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్న వారి వివరాలు తెలిస్తే, తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలను కోరింది. అలాంటి సందేశాలు లేదా పోస్టులకు సంబంధించిన సమాచారాన్ని 8712672222 అనే వాట్సప్ నంబర్‌కు పంపించడం ద్వారా తెలియజేయవచ్చని సైబర్ సెక్యూరిటీ బ్యూరో సూచించింది.



## వైద్య రంగాన్ని గాడిలో పెడుతున్నాం

- వైద్యానికి ఏడాదిలో రూ. 11482 కోట్లు ఖర్చు చేశాం
- ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క
- ఖమ్మంలో ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన

బలగం టీవి, ఖమ్మం

గత ప్రభుత్వం గాలికొదిలేసిన వైద్య రంగాన్ని గాడిలో పెడుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. గత ప్రభుత్వం గాలికి వదిలేస్తే రాజీవ్ ఆరోగ్య శ్రీ పెండింగ్ బిల్లులను తమ ప్రభుత్వం క్లియర్ చేస్తోందన్నారు. గురువారం ఖమ్మంలో మెడికల్ కళాశాల భవన శంకుస్థాపన కార్యక్రమంలో భట్టి తో పాటు, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వైద్య ఆరోగ్య దామోదర రాజనర్సింహం, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా భట్టి మాట్లాడుతూ%ా% ఖమ్మం మెడికల్ కళాశాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయటం సంతోషంగా ఉందని చెప్పారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఉద్యోగులు అర్థం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారని భట్టి చెప్పారు. అంతేగానీ ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర

మిగితా 2వ పేజీలో

# ఆపరేషన్ సిందూర్‌ను ఎవరూ ఆపలేరు.

- దేశ రక్షణ కోసం మేమంతా ఒక్కటే
- వీర జవానుల వెంట నడవడానికి తెలంగాణ ప్రజలు సిద్ధం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- భారత సైన్యానికి సంఘీభావంగా ర్యాలీ




బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

"భారత సార్వభౌమాధికారం వైపు కన్నెత్తి చూసినా.. అలాంటి వారికి ఈ భూమి మీద నూకలు చెల్లినట్టే. భారతీయ వీర జవానులకు 140 కోట్ల దేశ ప్రజల మద్దతుంది. మా వీర జవానులు తలుచుకుంటే ప్రపంచ పటంలో మీ ఉనికి లేకుండా చేయగలరు" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఉగ్రవాదులను హెచ్చరించారు. "భారతీయ సైన్యం ప్రారంభించిన ఆపరేషన్ సిందూర్‌ను ఎవరూ ఆపలేరు. భారతదేశ రక్షణ కోసం మేమంతా ఒక్కటే. వీర జవానులు ఏ చర్య తీసుకున్నా అందుకు మద్దతుగా వారి వెంట నడవడానికి తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారు" అని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత సైన్యానికి సంఘీభావంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ముఖ్యమంత్రి గారు ముందుండి ర్యాలీ నిర్వహించారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వద్దకు చేరుకుని పహల్గామ్ ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారి చిత్రపటాలకు ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టివిక్రమార్క గారితో కలిసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ, వీర జవానులకు దేశం అండగా నిలబడుతుందని ఉగ్రవాద ప్రేరేపిత పాకిస్తాన్‌కు గట్టిగా హెచ్చరించారు. భారత వీర జవానులకు దేశ ప్రజలందరూ అండగా ఉన్నామని, భారత దేశ సార్వభౌమాధికారం మీద ఎవరు దాడి చేసినా వారిని వదలిపెట్టబోమనే సందేశాన్ని ఈ తెలంగాణ గడ్డమీద నుంచి ఇవ్వడానికే ఈ ర్యాలీ నిర్వహించామని చెప్పారు. "భారత వీర జవాన్లకు అండగా నిలబడి, వారికి ఒక స్ఫూర్తిని ఇవ్వడానికి ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ దళాల ప్రతినిధులు, మాజీ ఆర్మీ అధికారులు, రాష్ట్ర పోలీసు అధికారులు, సచివాలయ ఉద్యోగులంతా వేలాదిగా ఈ సంఘీభావ ర్యాలీకి తరలివచ్చి మన సైనికులకు అండగా నిలిచినందుకు అందరికీ అభినందనలు.

పాకిస్తాన్ ఉగ్రవాదులకు, పాకిస్తాన్ పాలకులతో పాటు ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి ఈ దేశ సార్వభౌమాధికారంపై దాడి చేయాలనుకున్న ప్రతి ఒక్కరికీ ఈ ర్యాలీ ద్వారా హెచ్చరిస్తున్నాం. మా వైపు కన్నెత్తి చూసినా ఈ భూమి మీద మీకు నూకలు చెల్లినట్టే. ఈ భూమి మీద నివసించడానికి మీరు అర్హత కోల్పోయినట్టే. శాంతి ద్వారానే బ్రిటిష్ పాలన నుంచి విముక్తి పొందాం. పాకిస్తాన్‌కు సైతం స్వతంత్రం వచ్చిందంటే అమరుడైన మహాత్మాగాంధీ శాంతియుత పోరాటం వల్లే. అమరుడైన మహాత్మాగాంధీ శాంతి సిద్ధాంతాన్ని పునికి పుచ్చుకున్న 140 కోట్ల భారతీయులు ప్రపంచంలో శాంతిని కోరుకుంటూ అభివృద్ధి పథం వైపు దేశాన్ని నడిపించాలని కోరుకుంటున్నారు. భారతదేశం ప్రపంచంలోనే ఒక గొప్ప దేశంగా, ఒక గొప్ప స్ఫూర్తినిచ్చే దేశంగా నిలబెట్టాలని కోరుకుంటున్నారు.మా శాంతిని, మా శాంతి ఆకాంక్షను, చేతగాని తనంగా ఎవరైనా భావిస్తే, మా భూ భాగంలో కాలుమోపి మా ఆడబిడ్డల నుదిటి సిందూరాన్ని తుడిచివేయాలని అనుకుంటే వారిని నేలమట్టం చేసే శక్తి మా వీర సైనికులకు ఉంది. వారికి 140 కోట్ల భారతీయులు అండంగా నిలబడుతారు. జై హింద్" అంటూ ముగించారు. ఈ ర్యాలీలో మంత్రివర్గ సహచరులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారు, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ కు చెందిన ప్రతినిధులు, మాజీ అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

## మందుపాతర పేలి ముగ్గురు పోలీసుల మృతి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూం

ములుగు జిల్లాలో మావోయిస్టులు అమర్చినట్లు భావిస్తున్న మందుపాతర పేలిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ దుర్ఘటనలో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. మండల పరిధిలోని వెంకటాపురం మండల సరిహద్దుల్లో గల అటవీ ప్రాంతంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. నిషేధిత మావోయిస్టు పార్టీ కార్యకలాపాల నేపథ్యంలో పోలీసులు ఆ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలిందని సమాచారం. ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల్లో బుధవారం భద్రతా బలగాలకు, మావోయిస్టులకు మధ్య భారీస్థాయిలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఆపరేషన్‌లో 22 మంది మావోయిస్టులు మృతి చెందారు.



# ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్ద పీట..

**-రైతుల పేరుతో రాజకీయాలు మానుకోవాలి..**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

ప్రజా ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..గురువారం వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 19 లక్షల 99 వేల విలువ గల 53 ముఖ్యమంత్రి సహాయ నిది చెక్కులను అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పంపిణీ చేశారు.అనంతరం బీసీ సంక్షేమ శాఖ రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ జన్మదినం సందర్భంగా కేకే కట్ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజా ఆరోగ్య శ్రీ ని 10 లక్షలకు పెంచడం జరిగిందని తెలిపారు.. మన ప్రాంతంలో వివిధ ఆరోగ్య సమస్యలతో చికిత్స తీసుకున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార, ఎల్ఓసి ల ద్వారా ఇప్పటి వరకు 20 కొట్లు పై చిలుకు మంజూరు చేయడం జరిగిందని అన్నారు.. పేదలకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని అన్నారు..గత ప్రభుత్వంలో అసలు గత ప్రభుత్వంలో ఎల్విసి అంటేనే తెలియధని ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు ఉపయోగపడేల అనేక మందికి ఎల్విసి లను మంజూరు చేయడం జరిగిందనిఅన్నారు...ఇప్పటికే వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్య పరంగా పేదలకు మెరుగైన సేవలు అందిస్తున్నమని వేములవాడ నియోజకవర్గ ప్రజలకు వైద్య పరంగా ఎలాంటి ఇబ్బందు తలెత్తకుండా నూతనంగా రుద్రంగి మండల కేంద్రంలో 1 కోటి 43 లక్షలతో, ఫాజుల్ నగర్ లో 1 కోటి 43 లక్షలతో ఆసుపత్రి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు.

రైతులు ఎలాంటి అపోహలూ పెట్టుకోవద్దు వడ్ల కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా నడుస్తుందన్నారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయత్వంలో మంత్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.. వర్షం పడి తడిసిన ధాన్యాన్ని కూడా తప్పకుండా కొనుగోలు చేస్తన్నమని, కొందరు కావాలని రైతుల ముసుగులో రాజకీయాలు చేస్తున్నారని, రైస్ మిల్లర్లు బ్యాంకు గ్యారంటీ ఇవ్వకుంటే ఇంటర్ మిడిట్ గోదాంలలో ధాన్యాన్ని నిలువ చేశామన్నారు.. వారం పది రోజుల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తీ చేస్తామని, ప్రతి రోజూ అధికారులతో ,రైతులతో మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూస్తున్నామని,రైతులను అండం పెట్టుకొని రాజకీయాలు చేయడం మానుకోవాలన్నారు.. కొన్ని విషయాల పై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పద్ధతి ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.. మీరూ అందించే సూచనల సలహాలు స్వీకరిస్తూ ముందుకు పోతున్నమని,త్వరలోనే రాజన్న ఆలయ విస్తరణ,అభివృద్ధికి టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభం చేయడం జరుగుతుందన్నారు.



## సిరిసిల్ల యువ కవికి తెలుగు భాషా చెతన్య సమితి పురస్కారం..

**బలగం టీవీ, సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలానికి చెందిన యువ కవి అంకారపు రవి కి హైదరాబాదులోని త్యాగరాయ గాన సభ ఆడిటోరియంలో తెలుగు భాషా చైతన్య సమితి 12వ వార్షికోత్సవం సందర్భంగా వారి ఆధ్వర్యంలో యువ పురస్కారం ప్రశంస పత్రం అందజేశారు. యువ పురస్కారం పొందిన సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కవులు, రచయితలు అధ్యక్షులు ఎలాగొండ రవి, కార్యదర్శి వాసర వేణి పరశురాం, ఉపాధ్యక్షులు బుర దేవానందం, గుండెల్లి వంశీ, దూస గణేష్ లు రవికి అభినందనలు తెలిపారు.

# పల్లె దవాఖానాల తలుపులు తెరుచుకునేదెన్నడు?

**-ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సెంటర్ నిర్మిస్తే బాగుండు?**

**బలగం టీవీ,బోయినిపల్లి**



ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేయాలన్న ఉద్దేశంతో ఏర్పాటుచేసిన పల్లే దావఖానాలు అలంకారప్రాయంగా మారుతున్నాయి. గ్రామీణ వైద్యాన్ని బలోపేతం చేస్తూ గత ప్రభుత్వం పల్లె దవఖానాలు నిర్మించింది.బోయినిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిదిలో రెండు సబ్ సెంటర్లు,కొదురుపాక ఆరోగ్య కేంద్ర పరిధిలో రెండు సబ్ సెంటర్లు, విలాసాగర్ ఆరోగ్య కేంద్ర పరిధిలో మూడు సబ్ సెంటర్లు ఉన్నాయి.ఇవి మొత్తం అద్దె భవనంలో కొనసాగుతున్నాయి.

ప్రస్తుతం నూతనంగా గత ప్రభుత్వం బోయినిపల్లి మండల కేంద్రంతో పాటు వరదవెల్లి, కొదురుపాక గ్రామలలో మొత్తం మూడు పల్లె దవాఖానాలను నిర్మించింది.భవన నిర్మాణ పనులు పూర్తయిన దవాఖాన తలుపులు ఏండ్లు గడుస్తున్నా కూడా ఇప్పటికీ తెరుచుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.దీనితో పాటు దవఖాన చుట్టూ పిచ్చి మొక్కలు పెరుగుతున్నాయని,ఇప్పటికైనా పల్లె దవాఖానాలను త్వరగతిన ప్రారంభించి, గ్రామీణ ప్రజలకు వైద్యం అందించాలని ప్రజలు కోరుతున్నారు. బోయినిపల్లి మండల కేంద్రంలో మరియు కొదురుపాక గ్రామంలో ఆరోగ్య కేంద్రాలు ఉన్నప్పటికీని పల్లె దవాఖానాలు ఈ గ్రామాలలో కాకుండా ఇతర వేరే గ్రామాలలో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా మంచి సెంటర్ చూసుకొని నిర్మిస్తే బాగుండునని, గ్రామాల ప్రజలు హాసహనానికి గురవుతున్నారు. పల్లె దవఖాన భవనాలు పూర్తి అయిన కూడా విద్యుత్ సమస్య, నీటి సమస్యతో పాటు చిన్న చిన్న సమస్యలు ఇప్పటివరకు కూడా పూర్తి కాలేదు. ఇప్పటికైనా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మరియు ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని వెంటనే వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## బీజాపూర్‌లో ఎన్‌కౌంటర్ .. 8 మంది మావోయిస్టులు మృతి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ సరిహద్దుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు చనిపోయినట్టు భద్రతాబలగాలు వెల్లడించాయి. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, మావోయిస్టు ఎస్‌జెడ్‌సీఎం బండి ప్రకాశ్ ఉన్నట్టు సమాచారం. చంద్రన్న తలపై రూ.కోటి రివార్డు ఉంది. బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలోని లంకపల్లె అడవుల్లో ఎదురు కాల్పుల మోతలతో స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు.

# 100 మంది ఉగ్రవాదలు హతం

(మొదటి పేజీ తరువాయి)

ఒకే గొంతెతో మాట్లాడారని, బాధ్యత, పరిణితితో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారని తెలిపారు.

ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు ఐక్యంగా నిలుస్తాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దేశం కోసం ప్రభుత్వానికి, భద్రతా దళాలు తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటించామని అన్నారు. మంచి సందేశం ఇవ్వడానినికి ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. సమావేశానికి ప్రధాని మోడీ హాజరుకాకపోవడం పట్ల నిరాశ చెందానని రాజ్యసభ ప్రతిపక్ష నేత ఖర్గే అన్నారు. ప్రధాని మోడీ పాల్గొని ఉగ్రవాదంపై చర్యల గురించి క్లుప్తంగా మాట్లాడాలని తాము కోరుకున్నామని, ఈ ఘటనకు సంబంధించిన వివరాలను వెల్లడిస్తారని అనుకున్నామని, కానీ ఆయన సమావేశానికి హాజరుకాలేదని అన్నారు. ధైర్యసాహసాలు ప్రదర్శించిన జవాన్లకు తాము సెల్యూట్ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందుకు సాగాలని, కేంద్రం తీసుకునే నిర్ణయాలలో తాము ప్రభుత్వంతో ఉంటామని, సైన్యంతో నిలబడతామని అన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో నివసించే ప్రజల భద్రత అంశాన్ని కూడా రాజకీయ పార్టీలు లేవనెత్తాయని అన్నారు. జమ్మూకాశ్మీర్‌లో కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారిని జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశం ఏర్పాటు చేస్తే ఎంపిలు తమ అభిప్రాయాలను ముందుకు తెచ్చి ప్రజల విశ్వాసాన్ని పెంచుకోవచ్చని ఖర్గే అన్నారు. అయితే పార్లమెంట్ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి హామీ ఇవ్వలేదని తెలిపారు.

## హైడ్రా అంటే కూల్చేదే కాదు...

(మొదటి పేజీ తరువాయి)

చెరువులు, నాలాల్లో ప్రవహించాల్సిన నీరు ఇళ్లల్లో పారుతుంటే వాటిని కాపాడుకోవలసిన అవసరం లేదా? మూసీలో బతకాలని ఏ పేదవారైనా అనుకుంటారా. నగరంలో 491 చెరు వులు, పెద్ద పెద్ద నాలాలు కబ్జాలకు గురయ్యాయి. ఎవరైతే మూసీ ఆక్రమణలను ప్రోత్సహించారో, ఎవరైతే నాలాలను ఆక్రమించారో వారే హైడ్రా అంటే భయపడుతున్నారు. తొందరలోనే మూసీ పరీవాహక ప్రాంత ప్రజల దగ్గరకు ప్రజా ప్రతినిధులు, అధికారులను పంపించి వారితో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేయిస్తా. వారి జీవితాలకు మంచి వెలుగు ఇవ్వాలని అనుకుంటున్నా. కావాలంటే వారందరికీ మరో ప్రాంతంలో ఇళ్ల పట్టాలిస్తాం. మూసీ మురికికూపంలో ఎందుకు బతకాలి. ప్రభుత్వ భూములున్న చోట వారికి అపార్ట్ మెంట్లు కట్టి ఇళ్లిస్తాం. ఆ కుటుంబాలు గౌరవంగా బతకడానికి ఏర్పాటు చేస్తాం" అని ముఖ్యమంత్రి గారు సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ గారు, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి గారు, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్తా గారు, హైడ్రా కమిషనర్ రంగనాథ్ గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వైద్య రంగాన్ని గాడిలో పెడుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల అవసరాలు తీర్చడంలో ప్రభుత్వం ముందుంటుందని సీఎం చెప్పారని గుర్తు చేశారు. దానిని బీఆర్ఎస్, బీజేపీ నేతలు సిలువలు పలువులు చేసి మాట్లాడుతున్నారన్నారు. రూ. ఏడు లక్షల కోట్ల అప్పుచేసిన గత పాలకులు ఏనాడూ ఉద్యోగులకు మొదటి తారీకున జీతాలు ఇవ్వలేదన్నారు. ఎన్ని అప్పులున్నా రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేసినట్లే ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాపాడుకుంటామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని భట్టి అన్నారు. ఈ ప్రభుత్వం దొరల కోసమో, పాలకుల కోసమో పనిచేసే ప్రభుత్వం కాదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య వైద్యానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వైద్యరంగానికి రూ.5950 కోట్లు ఖర్చు చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఒక్క ఏడాదిలో 11482 కోట్లు ఖర్చు చేసిందన్నారు. 90లక్షల కుటుంబాలకు రూ.10 లక్షల వరకూ లబ్ధి చేకూర్చిన వైద్యం

## సజావుగా టిజి పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ..

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవి, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో మే 13న సజావుగా టిజి పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో టిజి పాలిసెట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులలో ప్రవేశాల నిమిత్తం మే 13న ఉదయం 11 గంటల నుంచి 1.30 వరకు జరిగే టీజీ పాలిసెట్ ప్రవేశ పరీక్ష సజావుగా నిర్వహించేందుకు అవసరమైన సకల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సిరిసిల్ల జిల్లాలో మొత్తం 2136 మంది విద్యార్థులు టిజి పాలిసెట్ ప్రవేశ పరీక్ష రాస్తున్నారని, వీరి కోసం 7 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

# జూనియర్ కళాశాలల అడ్మిషన్స్ పెంచాలి



- **జూనియర్ కళాశాలలను పగడ్బందీగా నిర్వహించాలి**
- **కలెక్టర్ సందీప్ కుమార్ ఝ**

**బలగం టీవీ,రాజన్న సిరిసిల్ల**

సిరిసిల్ల జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురు వారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఇంటర్మీ డియట్ శాఖ పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేసే లెక్చరర్లు, ఇతర సిబ్బందికి బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలు చేయాలని సూచించారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తీర్ణత శాతం పెంచాలని అన్నారు. గత 10సంవత్సరాలలో ప్రశ్నా పత్రాలలో వచ్చిన ముఖ్యమైన పాఠ్యాంశాలను అభ్యాసన చేయించి సప్లమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా తగు చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ వారం రోజులలో పూర్తి చేయాలని ఆదేశించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్స్ పెరిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి స్టాఫ్, లెక్చరర్ కు కళాశాలలో జరిగే అడ్మిషన్స్ పై లక్ష్యాలను కేటాయించాలని అన్నారు.కళాశాల సాధించిన మెరుగైన ఫలితాలు, మన దగ్గర ఉన్న నాణ్యమైన లెక్చరర్స్ వసతులను వివరిస్తూ అడ్మిషన్స్ పెంచాలని అన్నారు. కళాశాలల అనుమతులు, అఫిలేషన్ రెన్యూవల్ దరఖాస్తులు సకాలంలో పరిష్కరించాలని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల సమీప రోడ్ల నుంచి ఆర్టీసీ బస్సులు నడిచేలా చూసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శ్రీనివాస్ , జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజా మనోహర్ రావు, జిల్లా మైనారిటీ అభివృద్ధి అధికారి భారతి, విద్యా, ఫైర్ శాఖల అధికారులు, ప్రిన్సిపల్ లు తదితరులు పాల్గొన్నారు.

**కోనుగోలు చేసిన ధాన్యం తరలింపులో ఇబ్బందులు లేకుండా చూడాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

కొనుగోలు కేంద్రాలలో కోనుగోలు చేసిన ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలనీ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ఇప్పటి వరకు 244 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 1 లక్షా 28 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. గంభీర్ రావు పేట, రుద్రంగి, వీర్నపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు ఇబ్బందులు వస్తున్నాయని, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టిన తర్వాత పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని, కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేర రవాణా వాహనాలు, హమాలీల సమస్య రాకుండా చూసుకోవాలని అన్నారు. రవాణా వాహనాలు సరఫరా చేయని పక్షంలో సంబంధిత కాంట్రాక్ట్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం కేటాయించిన ధాన్యం దిగుబడి చేసుకొని రైస్ మిల్లుల పై చర్యలు తీసుకోవాలని సూచించారు.

జిల్లాలో ప్రతి మండలంలో అధికారులు చోరవ తీసుకుని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు జరిగేలా చూడాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద అన్ లోడింగ్ త్వరగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలనిఅన్నారు. అవసరమైతే ఎస్మా చట్టం డిఫాల్ట్ రైస్ మిల్లుల, రవాణా కాంట్రాక్టర్ మీద ప్రయోగించాలని, ఎక్కడైనా ఇతర ప్రాంత హమాలీలు అనే సాకుతో పనికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలనిఅన్నారు. రైస్ మిల్లుల వద్ద ఎటువంటి కోతలు ఉండవద్దని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన గన్ని బ్యాగులు సరఫరా చేయాలని అన్నారు.ఈ సమీక్షా సమావేశంలో డిఆర్డిఓ శేషాద్రి, డీ.టి.ఓ. వి.లక్ష్మణ్, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, పౌర సరఫరాల శాఖ అధికారులు రజిత, వసంత లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇల్లు పేదల ఆత్మ గౌరవానికి ప్రతీక

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ**

ఇందిరమ్మ ఇల్లు పేద ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీక అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..గురువారం చందుర్తి మండలం కొత్తపేట గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 13 ఇందిరమ్మ ఇల్లును రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ కొత్తపేట గ్రామంలో 13 ఇల్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఇప్పటికే బేస్ మెంట్ పూర్తి చేసుకొని నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని అన్నారు..రాష్ట్రంలోని నిరుపేదలు, గూడు లేనివారు ఆత్మగౌరవంతో బతకాలనే ఆలోచనతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మించాలని నిర్ణయించిందనీ అన్నారు.

గత ప్రభుత్వం పది సంవత్సరాలపాలనలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు నిర్మాణం చేయలేదని అన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పినట్లుగా పేద ప్రజలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చెసి నిర్మాణం చేస్తున్నామని అన్నారు.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్ల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందనీ పైలెట్ ప్రాజెక్టు కింద కొత్తపేట గ్రామం ఎంపికైందని అన్నారు. మంజూరైన లబ్ధిదారులు సొంత ఇంటి కల నెరవేరబోతున్నందుకు సంతోషంగా ఇంటి నిర్మాణాలు చేపట్టారనీ అన్నారు.గ్రామంలోని కొలకని రామవ్వ ఇల్లు లేదని ప్రభుత్వ విప్ కు తెలుపగా వెంటనే ఇల్లు మంజూరు చేయాలనీ అధికారులను ఆదేశించారు..

# దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు

**బలగం టీవీ, బోయినిపల్లి**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం. భారత్-పాకిస్తాన్ యుద్ధంలో భారత్ గెలవాలని మండలంలోని వరదవెల్లి గ్రామంలో దత్తాత్రేయ ఆలయంలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ: భారత్-పాకిస్తాన్ యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మన భారతదేశ ఆర్మీకి ఎలాంటి అవాంఛనాలు జరగకుండా మరియు యుద్ధంలో విజయం సాధించాలని, దత్తాత్రేయస్వామి వారికి ప్రత్యేక పూజలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సారంపల్లి రాజు, జనగం లక్ష్మణ్, ఆవుల లక్ష్మణ్, ఇల్లెందుల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ విస్తరణను సీక్రెట్‌గా పెట్టాల్సిన అవసరం ఏముంది

**-ఆలయ నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తి చేస్తారు...?**

**-బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధిలో అభివృద్ధి డిపిఆర్ ప్రాజెక్ట్ వివరాలను ఎందుకు గోప్యంగా ఉంచుతుండ్రు, అభివృద్ధి నివేదికలను కూడా ఎందుకు రహస్యంగా ఉంచుతున్నారని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు ప్రభుత్వ విప్ ను ప్రశ్నించారు. గురువారం వేములవాడ పట్టణంలోని చల్మెడ నివాసంలోఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోచల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ వేములవాడ అంటేనే ప్రసిద్ధి చెందిన రాజన్న ఆలయమని, పాత తెలంగాణ, నిజం స్టేట్ కర్ణాటక, బీదర్ లలో అతిపెద్ద దేవాలయంఅని, అలాంటి ఈ విశిష్టత కలిగిన దేవాలయాన్ని 1979లో పునర్ నిర్మాణం చేశారని అన్నారు.స్థానిక ఎమ్మెల్యే అది శ్రీనివాస్ ఆలయం మూసి వేసి అభివృద్ధి చేస్తాను అంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని, ఇదీ ఏమి వారి పర్సనల్ ప్రాపర్టీ కాదని,ఒక ప్రసిద్ధిగాంచిన దేవాలయం అని, దైవ సేవలో వ్యక్తిగత అభిప్రాయాల కన్నా, ఆగమ శాస్త్రం వారి సలహాలతో ప్లాన్ చేయాలని వారికి సూచిస్తున్నామన్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు 33ఎకరాల స్తలం సేకరించి ఈ ప్రాంతం అభివృద్ధి చేయాలని సీఎం కేసీఆర్ నాయకత్వంలో మీటింగ్ ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకొని, అన్ని వర్గాల ప్రజలతో చర్చలు జరిపిన తర్వాతనే అభివృద్ధి చేయడం జరిగిందని అన్నారు. ఇంట్లో పెళ్లి చేయాలంటానే అబ్బాయి, అమ్మాయిల అభిప్రాయం తీసుకుంటారని, అలాంటిది ఎవరికి తెలియకుండా, కనీసం రాజన్న ఆలయ ఉద్యోగులు, బ్రాహ్మణుల కూడా పరిగణలోకి తీసుకోకుండా అభివృద్ధి నివేదికల తయారీ జూన్ 15న ఆలయాన్ని మూసివేస్తామని ప్రకటన ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. బంద్ ప్రకటనతో రాజన్న సన్నిధికి వచ్చే భక్తులు, అవసరాల మీద ఆధారపడి వేలాది కుటుంబాలు జీవనోపాధి పొందుతుండగా ఆందోళన చెందుతున్నారని వారికి కనీసం ప్రభుత్వం తరపున స్పష్టత ఇవ్వాలన్నారు.

గతంలో 243 ఉంటే ప్రస్తుతం 315 అని గెజిట్ లో పేర్కొన్నారని,ఇందులో నుండి ఏమి పోతుందో మీకు చెప్పాల్సిన బాధ్యత లేదా అని అన్నారు. డబ్బులు ఎక్కడి నుండి వస్తాయి,ప్రభుత్వం నుండి వస్తాయా,గుడి ఎఫ్.డి నుండి తీస్తారావివరణ ఇవ్వాలని




అన్నారు.స్వామివారి డిపాజిట్లను తీసి అభివృద్ధి చేస్తామని చెబుతున్న మాటలు మా వరకు వచ్చాయని,వీటిలో ఏ ఫిక్స్ డిపాజిట్లు తీస్తారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ రాజన్న సన్నిధికి వచ్చి 76 కోట్లతో అభివృద్ధి చేస్తామని శిలాఫలకం వేశారని,ఆరు మాసాల అవుతోందని ఇందులో కనీసం ఒక రూపాయి అన్న కలెక్టర్, వీటీడీఏ అధికారులకు డిపాజిట్ చేశారా అని ప్రశ్నించారు. యాదగిరిగుట్ట తరహాలో ప్రణాళికను రచించి ఆర్కిటెక్ట్ ను నియమించి సి ఎం ముఖ్యమంత్రిగా 5ఏండ్లలో పూర్తి చేశారని,మరి ఒక ఎమ్మెల్యే గా మీరు ఎలా చేస్తారు,ఇందులో సీక్రెట్ ఏముందని అన్నారు.

ఆలయ ఇంజనీర్లను కాదని ఆర్ అండ్ బి వారితో పనులు ఎందుకు చేపిస్తున్నారని అన్నారు. రూ. 6కోట్ల పనులే ఇంతవరకు పూర్తి చేయకుండా బద్దిపోచమ్మ ఆలయం పూర్తి పనులు,మరి రాజన్న ఆలయాన్ని ఎట్లా అభివృద్ధి చేస్తారూ చెప్పాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. పైలట్ ప్రాజెక్ట్ గా బద్ది పోచమ్మ ఆలయాన్ని తీసుకొని తర్వాత రాజన్న ఆలయాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ తరపున గుడి అభివృద్ధికి సహకరిస్తాం కానీ క్లారిటీ లేకుండా పనులు చేస్తా అంటే ప్రజల పక్షాన నిలబడతామని అన్నారు.ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రాఘవరెడ్డి, రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, ప్యాక్స్ చైర్మన్ రామ్మోహన్, మాజీ కౌన్సిలర్లు సిరిగిరి చందు, గోలి మహేష్, జోగిని శంకర్, సీనియర్ నాయకులు ప్రసాద్ రావు, నరాల దేవేందర్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, మల్లేశం, అంజద్ పాషా, వాసాల శ్రీనివాస్, గుడిసె సదానందం, వెంకట్ రెడ్డి, పోతూ అనిల్ కుమార్, చేపూరి రవీందర్, పైడి శ్రీనివాస్, సుంకాపాక రాజు, రవిచంద్ర గౌడ్, కట్ట తిరుపతి, సందీప్, హింగే కుమార్, ఎండీ అసద్, రాకేష్, అనిల్, ప్రమోద్, తదితరులు ఉన్నారు.



# ఘనంగా మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలు

**బలగం టీవీ, బోయినిపల్లి**

రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 58వ జన్మదిన వేడుకలను బోయినిపల్లి మండల కేంద్రంలో జిల్లా బీ.సీ సెల్ అధ్యక్షులు కూస రవీందర్ ఆద్వర్యంలో గణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి, టపాసులు పేల్చి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కూస రవీందర్ మాట్లాడుతూ: పొన్నం ప్రభాకర్ ఆయురారోగ్యాలతో ఉండాలని, మరెన్నో ఉన్నత పదవులు చేపట్టాలని, వేములవాడ రాజారాజేశ్వర స్వామిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమ్ రెడ్డి మహేశ్వర్ రెడ్డి, ఏ.ఎం.సి చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టపల్లి సుధాకర్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతి గౌడ్, ఏ.ఎం.సి డైరెక్టర్ అనుముల హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు సంబ లక్ష్మీ రాజం, ఏనుగుల కనకయ్య, బోలమాల శంకర్, నాగుల వంశీ, పిట్టల రమేష్, తదితరులు ఉన్నారు.

# పంజాబ్, ముంబై మ్యాచ్ వేదిక మార్పు



బలగం టీవీ, హైదరాబాద్

ఈనెల 11న పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ మధ్య ధర్మశాల వేదికగా జరగాల్సి ఉన్న ఐపీఎల్ మ్యాచ్ వేదిక మారింది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పాకిస్థాన్ సరిహద్దును ఆనుకుని ఉన్న ఎయిర్‌పోర్ట్‌లను మూసేసిన విషయం తెలిసిందే. ఇందులో ధర్మశాల కూడా ఒకటి. షెడ్యూల్ ప్రకారం ముంబై ఆటగాళ్లు గురువారం ధర్మశాలకు చేరుకోవాల్సి ఉన్నా విమానాశ్రయాన్ని మూసేయడంతో మ్యాచ్ వేదికను మార్చడం అనివార్యమైంది. ఈ మేరకు బీసీసీఐ, గుజరాత్ క్రికెట్ అసోసియేషన్ (జీసీఏ) ఈ విషయాన్ని ధృవీకరించాయి.

# భారత కామెంటేటర్లు తీరును మార్చుకోవాలి

- రోహిత శర్మ

బలగం టీవి, హైదరాబాద్



భారత కామెంటేటర్లపై రోహిత్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశాడు. పనిగట్టుకొని మరి ఆటగాళ్లపై విమర్శలు గుప్పిస్తున్నారని అసహనం వ్యక్తం చేశాడు.టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ బుధవారం రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఓ సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రోహిత్ శర్మ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు.భారత కామెంటేటర్లు తమ తీరును మార్చుకోవాలని సూచించాడు. భారత్‌లో స్పోర్ట్స్ జర్నలిజం మారాల్సిన అవసరం ఉందన్నాడు. 'ఆస్ట్రేలియాలో కామెంట్రీ ఒక స్థాయిలో ఉంటే భారత్‌లో మాత్రం భిన్నంగా ఉంది. భారత వ్యాఖ్యాతలు ఒక ఆటగాడిని ఎంచుకొని అతని గురించి ప్రతికూలంగా మాట్లాడుతున్నారు. గతంలో నాణ్యమైన క్రికెట్ గురించే మాట్లాడేవారు. కానీ ఇప్పుడు ఓ ఎజెండాతో కామెంట్రీ చెబుతున్నారు.




# పాక్ ఓటీటీ కంటెంట్ ప్రసారాలు

## నిలిపివేయాలని ఆదేశాలు

బలగం టీవి, హైదరాబాద్

ఓ పక్క ఆయుధాలతో దాయాది దేశానికి బుద్ధి చెబుతూనే మరోపక్క వ్యూహాత్మంగా పాకిస్థాన్‌పై అన్ని విధాలుగా ముప్పేట దాడి చేసేందుకు భారత ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా ఇప్పటికే మన దేశం నుంచి వెళ్ళే నదీజలాలను పాక్‌లోకి వెళ్ళకుండా ఆపేసింది. ఇక తాజాగా వినోద రంగం విషయంలోనూ భారత్ ప్రతీకార చర్యలకు తెరలేపింది. వినోదం విషయంలో ఓటీటీలు విప్లవాత్మక మార్పులకు నాంది పలికాయి. భాషా సరిహద్దులను సైతం చెరిపేశాయి. భారత్–పాక్ మధ్య ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో పాక్ మూలాలున్న ఓటీటీ కంటెంట్‌ను పూర్తిగా నిలిపివేయాలని భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఓటీటీ ఫ్లాట్‌ఫామ్‌లకు శుక్రవారం సూచనలు జారీ చేస్తూ ప్రకటన విడుదల చేసింది.

జాతీయ భద్రత దృష్ట్యా పాకిస్థాన్ మూలాలున్న ఓటీటీ కంటెంట్, ఓటీటీ వేదికలు, మీడియా స్ట్రీమింగ్ ఫ్లాట్ ఫామ్‌లు, మధ్యవర్తిత్వం ద్వారా అయ్యే ఏ ప్రసారమైనా ఇక పూర్తిగా నిలిపివేస్తున్నాం. పాకిస్థాన్ వెబ్‌సిరీస్‌లు, సినిమాలు, పాటలు, పాడ్‌కాస్ట్‌లు సహా మీడియా కంటెంట్ ఏదీ ఇక భారత్‌లో అందుబాటులో ఉండదు. సబ్‌స్క్రిప్షన్, సహా ఇతర మార్గాల ద్వారా కంటెంట్ పొందుతున్న వారికీ ఇందులో ఏ మినహాయింపు లేదు. ఓటీటీ వేదికలు పాకిస్థాన్ కంటెంట్‌ను భారత్‌లో స్ట్రీమింగ్ చేయడానికి వీల్లేదు అని సమాచార, మంత్రిత్వ శాఖ ఆదేశించింది. తాజా నిర్ణయంతో నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వీడియో, యూ ట్యూబ్, జియో సినిమా సహా అన్ని ఓటీటీ వేదికలు పాక్ కంటెంట్ స్ట్రీమింగ్‌ను భారత్‌లో కచ్చితంగా నిలిపివేయాల్సిందే.

# పంజాబ్ కింగ్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్ రద్దు..!

- ఫ్లడ్ లైట్ల సాంకేతిక సమస్య తలెత్తడంతో మ్యాచ్ నిలిపివేత
- భద్రతా కారణాలతోనేనా..!
- రెండు జట్లకు చెరో పాయింట్



బలగం టీవి, హైదరాబాద్

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ధర్మశాల వేదికగా గురువారం జరగాల్సిన మ్యాచ్ రద్దయ్యింది. స్టేడియంలో ఫ్లడ్ లైట్ల సాంకేతిక సమస్య తలెత్తడం వల్ల మ్యాచ్‌ను మధ్యలోనే ఆపేశారు. స్టేడియం ఉన్న ప్రాంతంలో విద్యుత్తు అంతరాయం కారణంగా స్టేడియంలోని ఫ్లడ్ లైట్లలో ఒకటి చెడిపోయిందని తెలిసింది.. అందుకే అనివార్యంగా మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. దీనితో స్టేడియంలో ప్రేక్షకులకు కలిగిన అసౌకర్యానికి బీసీసీఐ విచారం వ్యక్తం చేసింది.

అయితే భద్రతా కారణాల నేపథ్యంలో ఈ మ్యాచ్‌ను అర్ధాంతరంగా రద్దు చేసినట్టు తెలుస్తోంది. జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, పంజాబ్ ప్రజల శ్రేయస్సు కోసం ఈ మ్యాచ్‌ను మధ్యలో నిలిపివేసినట్లు అర్థమవుతోంది. భారత సాయుధ దళాలు చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌కు ప్రతీకారంగా పాకిస్థాన్ నుంచి దాడులు జరుగుతుండడంతో ఈ మ్యాచ్‌ను నిలిపివేసినట్టు సమాచారం.ముందుగా ఫ్లడ్ లైట్స్ ఆపేసి ప్రేక్షకులను మైదానం నుంచి బయటకు తరలించినట్లు జాతీయ మీడియా పేర్కొంది. మరోవైపు సాంకేతిక కారణాల వల్ల ఈ మ్యాచ్ రద్దయ్యిందని అధికారిక బ్రాడ్ కాస్టర్ జియో హాట్ స్టార్, స్టార్ స్పోర్ట్స్ ప్రకటించాయి. ఐపీఎల్ నిర్వాహకులు కూడా మ్యాచ్ రద్దయ్యిందని పేర్కొన్నారు. కానీ కారణాలు వెల్లడించలేదు.


అంతకు ముందు వర్షం కారణంగా మ్యాచ్ ఓ గంట ఆలస్యంగా రాత్రి 8:30కు ప్రారంభమైంది. ఆట రద్దయ్యే సమయానికి పంజాబ్ కింగ్స్ 10.1 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 122 పరుగులు చేసింది. ప్రియాన్ష్ ఆర్య(34 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్స్‌లతో 70), ప్రభ్‌సిమ్రాన్ సింగ్(50) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో నటరాజన్ ఏకైక వికెట్ తీసాడు.



# శ్రీకృష్ణుడి రోల్ చేయాలని ఉంది

- ఆమిర్ ఖాన్

బలగం టీవి, హైదరాబాద్



బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తన డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన 'మహాభారత్' గురించి తాజాగా మాట్లాడారు. మహాభారత్ తనకు శ్రీకృష్ణుడి పాత్రలో నటించాలని ఉందని మనసులోని మాటను చెప్పుకోచ్చాడు. ఈ ఇతిహాసాన్ని భిన్నమైన రీతిలో, భారీ స్థాయిలో తెరకెక్కించాలని ఆమిర్ ఎప్పటినుంచో కలలు కంటున్న విషయం తెలిసిందే.తాజాగా జరిగిన ఇండియాఏ2047 సమ్మిట్‌లో అమీర్ ఖాన్ మాట్లాడుతూ.. మహాభారత్ డ్రీమ్ ప్రాజెక్ట్ గురించి స్పందించాడు. 'మహాభారత్' తన జీవితకాలపు స్వప్నమని, అయితే అది చాలా కష్టమైన ప్రాజెక్ట్ అని అన్నారు. "మహాభారత్ మిమ్మల్ని ఎప్పటికీ నిరాశపరచదు, కానీ మీరు మహాభారత్‌ను నిరాశపరచవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ సినిమాలో తాను ఏ పాత్ర పోషించాలని అనుకుంటున్నారని అడిగిన ప్రశ్నకు అమీర్ ఖాన్ సమాధానమిస్తూ, "నిజానికి, కృష్ణుడు పాత్ర నన్ను బాగా ఆకర్షిస్తుంది. ఆయనంటే నాకు చాలా స్ఫూర్తి. కాబట్టి ఆ పాత్రను పోషించాలని ఉంది" అని అన్నారు. 'మహాభారత్'ను ఒక భారీ ఫ్రాంచైజీగా రూపొందించాలని, అన్ని భాగాలు ఒకేసారి చిత్రీకరించబడతాయని, వివిధ దర్శకులు ఒక్కో భాగానికి దర్శకత్వం వహిస్తారని ఇదివరకే అమీర్ ఖాన్ తెలిపారు. ప్రస్తుతం అమీర్ ఖాన్ తన తదుపరి చిత్రం 'సితారే జమీన్ పర్' విడుదల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రం జూన్ 20, 2025న విడుదల కానుంది.




# ఓటీటీలోకి అజిత్ 'గుడ్ బ్యాడ్ అగ్లీ'

బలగం టీవి, హైదరాబాద్

అజిత్ కుమార్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' ఓటీటీలోకి వచ్చేసింది. 'మార్క్ ఆంటోనీ' విజయం తర్వాత దర్శకుడు అధిక్ రవిచంద్రన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించగా.. అజిత్‌తో పాటు త్రిష, అర్జున్ దాస్, ప్రసన్న, ప్రభు, యోగి బాబు, సునీల్ తదితరులు ఈ సినిమాలో నటించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించగా, మైత్రి మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద హిట్‌గా నిలిచి తాజాగా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో ఈ చిత్రం ప్రస్తుతం తెలుగుతో పాటు, మలయాళం, హిందీ, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతుంది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను పంచుకుంది నెట్‌ఫ్లిక్స్.

# నేరుగా ఓటీటీలోకి 'అనగనగ'

బలగం టీవి, హైదరాబాద్

సన్నీ సంజయ్ దర్శకత్వంలో సుమంత్ ప్రధాన పాత్రలో రూపొందుతున్న మూవీ 'అనగనగ'. రాకేష్ రెడ్డి గడ్డం, రుద్ర మాదిరెడ్డి నిర్మిస్తున్న ఈ సినిమాలో కాజల్ చౌదరి కథానాయికగా కనిపించనుంది.. కాగా, ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను సృష్టించింది. తాజాగా మేకర్స్ ఈ సినిమా స్ట్రీమింగ్ డేట్ ని అనౌన్స్ చేశారు. మే 15 నుంచి ఈ సినిమా ఈటీవీ విన్ లో స్ట్రీమింగ్ కానున్నట్టు ప్రకటించారు.

